తమ్ముడు

[కథ]

= శ్రీ కందుకూరు లింగరాజు =

(గతసంచిక తరువాయి)

రైల్లో ఎక్కినప్పుడే కక్కాయికి దూరంగా ఉన్నానుకదా అని ఓ ధైర్యం కల్గి తనను నిష్పక్షపాతంగా సింహావలోకనం చేసుకున్నాడు. ఎంత ఎల్లా ఆలోచించుకున్నా కక్కాయిమాటలు శరీరానికి సిగరెట్లు అలవాటు చేసుకున్నట్టే అయింది.

అన్నయ్య ఇంటిమెట్లు ఎక్కేటప్పుడు గుండెలు ఎందుకో వెనుదీశేయి. ఇదివరకటి రాముగా తాను ఆ ఇంట్లోకి వెళ్లటంలేదు.

శీతారామయ్య అవ్వాళ చెప్పకుండా తెల్లారగట్లే వచ్చేసేను, దొంగలాగ అన్న భావంలో చాలా కుళ్లిపోయేడు. ఇక తమ్ముడికి మొఖం ఎల్లా చూపిస్తానని యేడ్చేడు కూడాను. వెంకటలక్ష్మమ్మతో జరిగిందంతా చెప్పి చాలా బాధపడ్డాడు. ఆవిడా ఎటూ మాట్లాడలేక భర్తను చూచి, కన్నీళ్లుపెట్టుకుంటూనే "బ్రతికి ఉన్నన్నాళ్లూ మనిషిని కాల్చుకుతినేసేరు. చచ్చికూడా కక్కాయిరూపంలో ప్రవేశించి రక్తమే త్రాగేస్తోన్నా" రని గోలపెట్టింది. శీతారామయ్య ఏం సమాధానమూ చెప్పలేకుండానే వుండిపోయేడు. ఓవిధంగా వూహల్లో తమ్ముడేమైనా మారుతాడా అన్న సంశయం పొడమాపక పోలేదు.

తిరిగీ తమ్ముడు రావడం అటు శీతారామయ్యకూ, ఇటు వెంకటలక్ష్మమ్మకూ కూడా కొత్త ఆశ్చర్యం కల్గించింది. కక్కాయి రానివ్వదనే ఉద్దేశ్యంలో ఇద్దరూ పడ్డారు. పోనీ, ఎల్లాగో వచ్చేడనుకుని, పాడుపడిపోయిన గృహానికి దీపారాధన చేసినట్లే సంబరపడ్డారు.

మూడురోజులవరకూ రాము ఏం మాట్లాడలేదు. ఇక్కడే వుండి తమదగ్గరే చదువుకుంటాడనుకున్నారు. ఆ మూడు రోజుల్లోనే ఇల్లు మామూలు జీవనంలోకి వచ్చేసింది.

అవ్వాళ భోజనాలదగ్గర శీతారామయ్య అన్నాడు: "రాము! మా ఏజెంటును ఇవ్వాళ కాకినాడ ట్రాన్స్‌ఫర్ అడిగాను. ఇస్తానన్నాడు. మరి నీ కాలేజీ చదువుకు ఇక్కడ నుంచి..."

రామును ఓప్రక్క కృతజ్ఞత ఏడ్పించింది. చెప్పలేక చెప్పేడు: కక్కాయీ, తనూ కాకినాడలో కాపురంపెట్టి చదువు సాగిస్తామని.

ఆవార్త దంపతులిద్దరికీ పిడుగుపడ్డట్టు అయింది. రాము అంత యెత్తు ఎత్తుతాడని ఎప్పుడూ అనుకోలేదు. ఇరువురూ దిగనాశేపోయేరు.

"ఏదోనాయనా, మాకడుపున ఒక్కకాయ లేకపోవడం మూలాన నీ మీదనే మా ఆశలన్నీ నిల్పుకున్నాం. మాదగ్గర వుండే చదువుకుంటా వనుకుని సంబరపడ్డాం. ఏదో నువ్వు వచ్చినప్పటి నుంచీ ఇంటికి మాణిక్యంలా ఉన్నావు" అని వెంకటలక్ష్మమ్మ తన అమాయికత్వంలోనే అంది.

వాళ్లకన్నిటికీ కక్కాయిమాటల్లో అర్థంతీస్తే ముందు రాబోయే పెనుగాలికి ప్రతీహారులూ, కంచుకులూ క్రింద కన్పట్టింది రామూకు.

శీతారామయ్యకూడా చెప్పేడుకాని, "ఏదో కక్కాయి ముసలిదయిపోయింది. ఆట్టే సంవత్సరాలు కూడా బ్రతుకుతుందో లేదో. ఉన్నది మా వేపు ఆవిడ ఒక్కర్తేకదా. ఆవిడకోర్కె తీరుస్తే చచ్చేముందర సంతోషంగా ప్రాణంవిడుస్తుందేమో" అన్నాడు రామూ. మా, మీ అని విడతీయడం, అల్లా మాట్లాడడంతోటి శీతారామయ్యా, వెంకటలక్ష్మమ్మలకు ప్రాణాలు నిలువునా పోయినట్లే అయింది. తన పంచన ఓ పాముకు, రెండుతలల నాగుకు పాలుపోసేడా? అది ఇప్పటినుండీ బుసకొట్టడానికి కక్కాయి అనే పుట్టనాధారంగాచేసుకుని పడగలు విప్పుతోందా? ఆ విషలేపంచేత తన శరీరమే దగ్ధమైపోయి, శాంతిలేక అల్లాడుతూ ఈభూమిమీద నూకలు చాలించుకుంటుందా? చాలా ఆవేదనతోనే ఆఫీసుకు వెళ్లేడు. ఎవరితోనూ మాట్లాడలేకపోయేడు. రెండు మూడు సార్లు కళ్లమ్మట నీళ్లుకూడా వచ్చేయి.

ఏరోజున, ఏముహూర్తాన రామూను తెచ్చుకున్నాడో అప్పటినుండీ జీవితం సుఖంగా జరుగుతుందనే ఆశించుకుని సౌధాలు నిర్మించుకున్నాడు. కొడుకు, తమ్ముడు, అన్నిటికంటె కాబోయే అల్లుడు అనే ఇద్దరూ భావించుకుని కులికేరు. మరి ఇప్పుడో?

రామూ ఇల్లాంటి పనులు చేస్తాడా? భావిలో తనను పరిత్యజించి చిచ్చుపెడతాడా? ఎటూ నిర్ణయించుకోలేక చాలాసేపు బాధపడ్డాడు. శీతారామయ్య. అటు వెంకటలక్ష్మమ్మకూడా అన్నం తినలేకపోయింది. రామూ ఇంకకొద్దిరోజులకువస్తాడనగానే సెకండుఫారం చదువుతున్న అక్కగారి కూతురు నరసమ్మను తీసుకువచ్చి ఇంట్లో వుంచుకుంది. తన కున్న నగలు అన్నీ వేసి రామూసపర్యలకు నియోగించింది. రామూ ఆ ఎదిగిన అమ్మాయిచేత సపర్యలూ, చాకిరీ చేయించుకోడానికి సిగ్గుపడ్డాడు. వెంకటలక్ష్మమ్మ ఆ ఊహించుకున్న అల్లుడిలో కృతఘ్నత రాదన్న వూహలోనే పడి, ఇద్దరికీ ఒక్కసారే అన్నంపెట్టడం, 'అంత సిగ్గుపడతావేమే' అని పరిహాసకం ఆడడంతోటి మురిసింది. వాళ్లిద్దర్నీ మొగుడూ పెళ్లాంక్రిందే భావించుకుంది. సంతోషించింది. సంతతిలేని హృదయం పీయూషభాండం పొందినట్లే సుఖించింది. ఎన్నోసార్లు అనుకుంది: రామూకు ఆపిల్ల నచ్చిందా అని అడుగుదామని. కాని ధైర్యం చాలకపోయింది. ఆ మొదటి రోజుల్లో శీతారామయ్యను చెప్పమంది. శీతారామయ్యకూడ రామూ అప్పుడే తన అల్లుడైపోయినట్లు వూహల్లో సంతోషపడి "చూడవే, ఉన్న రెండురోజులున్నూ. ఇద్దరికీ ఏమైనా మనస్సు కలిసిందేమో!" అని అనేసేడు.

నక్యపధతులు తెలియని వెంకటలక్ష్మమ్మకు కులంలోంచి వెలేసినట్లే అయింది ఆమాటలు. రామూ ఇక వెళ్లిపోతాడంటే నిజంగా వెంకటలక్ష్మమ్మకు నిలుచున్నపళంగా కప్పెట్టినట్టయింది. అయినా, ఈమాటు ధైర్యంతో, గుర్రపుబండిలో సామాను పెట్టుకుని వెళ్తానని చెప్పడానికి వచ్చిన రామూతో, అంది. రామూ చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. అంతే. అటు దంపతులిద్దరికీ ఆ నవ్వు విషలిప్తమో, పీయూషసిక్తమో తెలియదు.

కాకినాడ రామారావుపేటలో కక్కాయీ, రామూ కాపురం పెట్టినతర్వాత శీతారామయ్య పెళ్లిసంబంధం విషయంలో మాట్లాడిరావలసిందని తోడల్లుణ్ణి పంపేడు. కూడా పెద్దమనిషి, అనుభవం కలవాడు అని సిద్ధాంతి సుబ్బరామయ్యనుకూడా జత పరిచేడు. కట్నాలూ లాంఛనాల విషయంలో నిష్పక్షపాతంగానే వుండమన్నాడు. తను అప్పో సొప్పో చేసి మూడు వేలకట్నం, ఎవరూ లేకపోయినా వెయ్యి రూపాయలు లాంఛనాలూ జరిపిస్తానని చెప్పమన్నాడు. "'రాజా' లా వున్నాయి కట్నకానుకలు. ఎందుకు ఒప్పుకోరేమిటి" అన్నాడు సిద్ధాంతి.

రామూ అక్కడనుంచి తిరిగివచ్చిన తర్వాత కక్కాయి రామూనుజరిగినదాన్ని గురించి చాలాసార్లు-కనీసం రోజుకు ఒక్కసారైనా అడిగేది. "చూచేవురా. వెధవ్వా. నీకు లోకం ఏం తెలుసు...ఆ ఇద్దరూ కలిసి ఎంతఎత్తు ఎత్తేరో! నీకు ఆముండను ముడెట్టి తమ చేతుల్లో కీలుబొమ్మక్రింద చేసుకుందామనుకుంటున్నారా? కానీ...వీళ్ల గడ్డి వీళ్లకు తినపించకపోతే నా పేరు కనకమ్మకా" దంది. రామూ కీచులాడుకున్నట్లే అయ్యేడు. కాని పైకి ఏం మాట్లాడలేదు.

పెళ్లిమాటలకు వారు రావడంతోటే కక్కాయి వెన్నపూసా, కన్నతల్లీక్రింద ఆప్యాయం, ప్రేమా ఊడి

పడేట్లు మాట్లాడింది. సంబంధం కలిస్తేనే చాలంది. కట్నకానుకల విషయం చాలా బావుంది అంది. అన్నిటికీ సరిగ్గానే సమాధానం చెప్పింది. "చూడ్డానికి నేనూ, అబ్బాయీ మాశీతన్న యింటికి వస్తా"మని కూడా చెప్పింది.

తీరా వాళ్లు గుమ్మందాటేటప్పుడు "శీతన్న ఆ అమ్మాయిని దగ్గరకుతీసుకున్నాడేమో, వాడి మాగాణీ కాస్తా అమ్మాయికి వ్రాస్తే బావుంటుందేమో" అంది. ఒక్కసారి సిద్ధాంతికీ, తోడల్లుడికీ అడుగుపడ లేదు. 'ఏదో' అని నసికినట్టే సిద్ధాంతి సర్దేడు... కక్కాయి ముందరికాళ్ల బంధం రామూకు ఒక్కసారిగా కొంచెం కొంచెం బోధపడింది "పీళ్లగడ్డి పీళ్లను తినిపించకపోతే నా పేరు కనకమ్మ కాదురా" అన్న ముక్క ఖండఖండాంతరాళాలలోంచి మ్రోగినట్టయింది.

కక్కాయి...ఆవిడకు మొగుడు చిన్నప్పుడే పోయేడు. ఒక్క కూతురుతప్ప ఇంకెవరూ లేకుండా కాలక్షేపంచేసింది. ప్రపంచం అంటే ఓ విషమైన కక్షు బయలుదేరి దాన్ని సాధించాలన్న భావంలో పడి జీవితం గడిపింది...ఇప్పుడు కక్కాయినిజస్వరూపం బోధపడింది.

"ఈ ముసలితొక్క... డెబ్బయ్యేళ్ల వృద్ధు... ఇంకా ఇన్ని జవసత్తువలు, నక్కజిత్తులు వున్నాయి... ఇంకా ఏ పనికీ వెనుదీయదు..." అని రామూ హడ లేడు. అయినా తనలో ఈ మధ్య ఇంజెక్షను తీసుకున్న శీతారామయ్యా వెంకటలక్ష్మమ్మలయెడ విముఖత, కోపం కక్కాయిచేష్టలను సమర్థించింది. పూర్ణంగా కారణాలచేత కాదు. కక్కాయి అంటే భయంచేత. అయినా లేతగా ఉండిపోయిన అన్నగారి మీద కృతజ్ఞత చచ్చిపోలేదని కాస్త తలెత్తింది.

పోనీ, నరసమ్మను పెళ్లిచేసుకోకుండా వుంటే ...ఆ విధంగా అయినా అన్నగారింట్లో తిన్న ఉప్పూ పులుసుకు కృతజ్ఞత చూపించవచ్చునేమో అనుకున్నాడు కాని నరసమ్మను చూచినప్పటినుండి ఏదోవిధంగా మనస్సు అటు లాగుతూనేవుంది.

ఆరోజు అడిగేసింది: "పిల్ల ఎట్లా వుంటుందిరా ?" అని. "బాగానే వుంటుంది" అన్నాడు.

"కన్నేసేవే"! అని ముసలినవ్వునవ్వింది.

కక్కాయిగుండెల్లో ఎంత విషం వుందో అప్పుడు బోధపడింది రామూకు. వచ్చినప్పటినుంచీ భౌతికంగానూ, మానసికంగానూ, ఆఖరుకు శారీరకంగాకూడా ఆ విడకుదాసుడై పోతున్నాడు. ఆ విడ ఎదురుచూపుల్ని చూడలేకపోతున్నాడు. ఆ విడలో ఏ మహత్తరశక్తి ఉందా అని ఆశ్చర్యపడ్డాడు.

శని ఆదివారాల్లో శీతన్న ఇంటికి వెళ్లి ఇద్దరూ పిల్లని చూచుకొనివచ్చేరు..."ఇంగ్లీషు చదివించేరా ? ఎందుకూ ? ఏమైనా పంతులమ్మపనికా ?" అనే వరసలో కట్టె విరిచినట్టు మాట్లాడింది.

వెళ్లేముందర అతిప్రేమతోనే చీరా, రవికల గుడ్డా చేతిలోపెట్టి "ఏదో ముసలిదాన్ని. బ్రతికి వున్నా. అప్పుడప్పుడు వస్తూవుండండి" అని వెంకటలక్ష్మమ్మతో చెప్పింది.

శీతారామయ్యకూ, రామూకూ కూడా ఆ విణ్ణి అర్థంచేసుకోడానికి ఇంకోజన్మ ఎత్తాలేమో అనిపించింది. "తాంబూలాలు పుచ్చుకోడానికి వచ్చినప్పుడే కట్నం ఇచ్చెయ్యాలి. పెళ్లి అయిదు రోజులూ చెయ్యాలి. మా వాణ్ణి ఎవరో పీటలమీద కూర్చోపెడతా. వాడికి పెద్దాపురం శిల్కుధోవతులు, బెంగుళూరు పట్టుచీరా పెట్టాలి. మాకు నేతితోనే అన్ని పదార్థాలూ చేయించాలి. అప్పగింతబట్టలు వచ్చిన వాళ్లందరికీ పెట్టాలి..." ఇల్లాంటి కోర్కెలన్నీ కోరేసింది.

తననువీథిలోపెట్టి అమ్ముతోందా, లేక పెళ్లి చేస్తోందా అన్నట్టు రామూకు అనిపించింది.

అన్ని వరతుల్లోనూ మధ్యవర్తులమధ్య బాండు వ్రాయించి మూడువేలు పుచ్చుకుంది. అటు శీతారామయ్య తమ్ముడే అన్న భావంలో ఏ మడిగితే అది ఇచ్చివెయ్యడానికి సిద్ధపడిపోయేడు. ఆఖరుకు తనకేమీ మిగలకపోయినా రెక్కలమీదనైనా జీవించగలనన్న ధీమాతో.

పెళ్లిలో కక్కాయి ఒంటికాలుమీద లేచింది. చుట్టాలు అయినా అవకపోయినా రెండువందలమందిని తీసుకొచ్చింది. అప్పగింతల దగ్గర కనీసం పాతికమందికైనా బట్టలు పెట్టి అప్పగించాలంది. శీతారామయ్య

ఇంచుమించు నరసమ్మకు ఏడుగడే అవడంవల్ల అన్నిటికీ తలొగ్గేడు. ఇచ్చిన చాపులు మాలాళ్లూ మాదిగాళ్లూ కట్టుకున్నట్టు ఉన్నాయని వాటిని చింపించి, గాడిపొయ్యిలో వేయించింది.

ఇలాగే ఇంకా ఎన్నో చేసింది. ఆఖరుకు "పెళ్లి అవుతుందా అవదా ? అసలు అవనిస్తుందా ? కక్షు సాధించుకోడానికేమైనా వచ్చిందా కనకమ్మ?" అన్న బితుకు అందరి హృదయాల్లోనూ పడింది.

శీతారామయ్య పెళ్లివారి కందరికీ పెద్ద అని ఓ శిల్కు ఆడకట్టుపంచెలజత కక్కాయికి ఇచ్చేడు. "ఏం నాయనా, నన్ను దబ్బున చచ్చిపొమ్మనా ? లేక మళ్లీ సధవను చేస్తావా ?నా శవంమీద కప్పమనడానికేనా ఈ జత ?" అంది.

శీతారామయ్య నిలువునా కూలిపోయేడు. తోడల్లుడికి ఆ మాటలు అరికాలిమంట లెక్కించాయి. శీతారామయ్యను చూచి వూరుకున్నాడుకాని లేకపోతే కపాలమోక్షం చేయించేద్దామన్నంత ఆవేశం కలిగింది. అటు రామూకుకూడా జరిగింది విని "ఈ మహమ్మారిని పీకినులిమేస్తే ఒదిలిపోతుంది" అన్నంత కోపం వచ్చిందికాని...తను ఇప్పుడు ఇల్లుపట్టిన వెధవ పెంచడంవల్ల శరీరంలో రక్తం అంతా నీరయిపోయింది.

తక్కినవన్నీ ఏదో అలా అలా జరిగిపోయాయి. వెంకటలక్ష్మమ్మకు "ఇదేమిట్రా, కొరివితో తలగోక్కున్నట్టయిందే" అనిపించింది. నరసమ్మ ఏమయిపోతుందో అని అన్నమే తినలేదు సరిగ్గా. ఓ ప్రక్క ఓ కంట సంతోషం, రెండో ప్రక్క కన్నీళ్లు—వీట్ల మధ్య నలిగిపోయింది.

శీతారామయ్యకు పెళ్లి ఐదువేలు పెట్టి చేసేనే అన్న మాటమాత్రమేకాని ఏమిటో సంతోషమూ, ఉల్లాసమూ కలిగిన పుణ్యానికి ఆయన నోచుకోనేలేదు. బెంగ, ముందేమవుతుందో అన్న ఆదుర్దా, ఇంకా కక్కాయి నరసమ్మను ఏడిపిస్తుందా అన్న ఆందోళన-వీటితోటి నిజంగా బెంగేపెట్టుకున్నాడు. తీరా తనూ, వెంకటలక్ష్మి కలిసి తోడల్లుడిమెడ విరిచి ఈ సంబంధానికి ఒప్పందం చేసేరు. అల్లాంటప్పుడు తన తలమీద బరువు ఎక్కువే అయింది. దీన్ని-ఈ బరువును జీవితాంతంవరకూ నొప్పిలేకుండా మొయ్యగలనా ? లేక అదే భారమై, ఎదురుతిరిగి, తన్నే తినేస్తుందా ?ఈ బాధ ఒకటి ఎక్కువైపోయింది. అది నుంచున్నా, కూర్చున్నా కొల్చుకుతినేస్తూనేవుంది. అల్లాగే నడపీనుగులా భరించేడు. ఎప్పుడు చెప్పకుండా గుండెపగిలిపోతుందో అన్నంత భీతిలోనే రోజులు లెక్కపెట్టుకున్నాడు.

ఏదో తర్వాత జరగవలసిన లాంఛనాలన్నీ సక్రమంగానే జరిగేయి. ఏ పెనుగాలీ లేకపోవడంతో 'పెళ్లివారనిపించుకోవద్దా అనే కక్కాయి ఆ పని చేసింది' అన్నవతులో పడి తృప్తిపడ్డాయి ఆరాటంతో, ఝుంఝూటాల్తో అల్లాడిపోయిన ఆత్మలు.

ఇంక అంతా అణిగిపోయింది అనుకునేటప్పటికే పెనుభూతంలా కక్కాయి అన్న మాటలు శీతారామయ్య చెవిని పడినవి. దాంతో హడలేపోయేడు. మనుగుడుపులు అయి తిరిగివెళ్లిన తర్వాత రామూకు, కొత్త నలగడంవల్ల, జ్వరం తగిలింది. దీన్ని ఆసరా చేసుకుని "మా వాడికి మందుపెట్టేసింది వెంకటలక్ష్మమ్మ...ఇంకేముందిరో నాయనా! పిచ్చాడో, వెర్రాడో అయి చచ్చిపోతాడు ... శీతారామయ్య పెట్టించాడురోయి!." అని వూరంతా ఏకేసింది. రెండురోజుల్లో జ్వరం తగ్గినా అందరూ ఆమాటే నమ్మేరు. భూతవైద్యం చేయించింది. కనపడినవాడు చెప్పిన వైద్యమల్లా చేయించింది. రక్షరేకు, విభూతి పెట్టించింది. తన్ను పిచ్చివాణ్ణిక్రింద చేసి కక్కాయి ఏడిపిస్తోందా ? లేక కక్కాయికే మతిపోయిందా ? ఎల్లాగైనా పెళ్లి అయినప్పటినుంచీ కక్కాయి విధానమంతా చాలా మారింది. అస్తమానూ శీతారామయ్యను ఎల్లా కొల్చుకుతిందామా అన్న తలంపే...రామూకే తలనొప్పి పుట్టిస్తోంది.

ఆ వసంతఋతువులో నరసమ్మ పెద్దమనిషి అయింది. నిషేధం తీర్చుకుంటే మంచిదని సిద్ధాంతిచేత కబురుపెట్టించేడు శీతన్న. బాగానే వుందంటూ తలూపి, "ముందు శీతన్న భూమిఅంతా అబ్బాయిపేర వ్రాస్తానన్నాడు. అది వ్రాస్తేనేకాని కార్యంమాట తలపెట్టుకో దలచలేదు" అని తేల్చేసింది కక్కాయి.

రామూకు కక్కాయిఎత్తుగడలు నెమ్మదిగా అర్థం అయ్యేయి. శీతారామయ్యను శాంతంగా ఒక్క ఘడియ నుంచోనియ్యడానికి ఇష్టంలేదు. ఏదో

పూర్వఘుడియల్లో ఉన్నదో, లేనిదో పగకల్పించి, ఇప్పుడు అదను దొరికింది కదా అని వేధిస్తోంది. తన ఆటలు సాగుతాయికదా అని నిజంగా నటరాజనృత్యం చెయ్యడానికి ప్రారంభించింది.

నరసమ్మతో పెళ్లికిపూర్వమే ఒకటి రెండు సార్లు మాట్లాడేడు రామూ! ఆ మాటల్లోని అమాయకత్వానికి నిజంగా ముగ్ధుడే అయ్యేడు. తన జీవితం సుఖపడుతుందికదా అని సంతోషపడ్డాడు. కాని అవన్నీ కక్కాయిచేష్టలవల్ల నీటిమీదివ్రాతల్లా కన్పిస్తున్నాయి. నరసమ్మయెడ తన హృదయంలో కల్గిన వాత్సల్యానికి దోహదం జరగదు; తను నరసమ్మతో కాపురంచేసి సుఖపడ్డం ఈ జన్మలో లేదు...చెయ్యనియ్యదు.

శీతన్నమీద రామూకు పెంపొందుతున్న ఓవిధమైన ద్వేషభావం క్రమంగా ఎక్కువే అవుతోంది. వెంకటలక్ష్మమ్మయెడకూడా ఆ భావం సమానంగానే పంచుకుంది. ఇక మిగిలిందల్లా నరసమ్మయెడమాత్రం ప్రేమ పోలేదు. మరి వాళ్లల్లో పెరుగుతోందే?... కక్కాయియెడ గురి ఎక్కువైపోతోంది. తను తెలియకుండానే ఆకర్షింపబడిపోతున్నాడు ... ఎల్లాగైనా శీతారామయ్యను శాంతంగా వుండనీకూడదు ... తన తల్లిని, తండ్రిని, దొరికితే తన్ను చంపిన, చంపదలచుకున్న శీతారామయ్యకుట్రకు తగిన ప్రతీకారం చెయ్యాలి. ఎట్లా? కాలం ఇంకేవిధంగా మారుతుంది? నరసమ్మను ఈ జూదంలో ఒడ్డి వాళ్లను జయించాలా? మరి తనో? నరరూపరాక్షసి అవటం లేదూ? కక్కాయి తన మంచికోసం పెడదార్లు తొక్కిస్తుందా? దరిదాపు సంవత్సరంనుంచి అర్థం చేసుకుంటున్నాడే?

ఎల్లాగైనా కక్కాయీ తనూ ఒకటి......నరసమ్మ...జీవితంలో ఒస్తారు పోతారు. తన కర్తవ్యం తను నెరవేర్చుకుంటే తన తల్లీ, తండ్రీ ఆలోకంలోనుంచేనా తృప్తిపడి రహస్యంగా దీవిస్తారన్న ఆశ. చచ్చిపోయిన తల్లీ, తండ్రీ జ్ఞాపకంవచ్చేరు. వాళ్లు నిరంతర శోకంతో దగ్ధం అయిపోతూ ప్రతీకారం, పగ అని అలమటించిపోతున్నట్లే తట్టింది రామూకు.

ఎల్లాగైనా శీతారామయ్యకు గుణపాఠం చెప్పాలి; తన ఆస్తి కాజేయదలచుకున్న ఆ నీచుడికి ఎదటివాళ్లు శక్తివంతులే అని తెలియజేయ్యాలి అన్న దృఢనిశ్చయం యెక్కువైపోయింది.

కక్కాయి రామూ తనతో పూర్ణంగా ఏకీభవించడంతో, అగ్నికి ఆజ్యం పోసినట్లే అయితే, తృప్తిపడిపోయింది. శీతారామయ్య మర్యాదాగానే ఉత్తరం వ్రాసిపంపేడు—తను తన భార్యాతదనంతరం ఆస్తి రామూపేర వ్రాసిస్తాననీ, దానికి తనకేమీ అభ్యంతరం లేదనినీ.

“పనికిరాదు. ఇప్పుడే వ్రాసి యివ్వాలి. అబ్బాయిపేరే. అమ్మాయిపేర కాదు. అమ్మాయి పేరేమిటి, మనోవర్తికి రాసిచ్చినట్టుగా” అని వాదించింది.

శీతారామయ్యకు ఎటూ తోచలేదు. అప్పుడే ఎల్లా వ్రాసిస్తాడు తనకున్న ఐదెకరాలమాగాణీన్నీ. తనకే రేపు పిల్లలుకలిగితే వాళ్లకు జోలిచ్చి బతికమంటాడా! తనో? ఈచిన్న జీతంతో ఎల్లా సరిపెట్టుకోగలడు? పైగా మొన్న పెళ్లికి అయిన అప్పో?

కొంతకాలం ఆగితే రామూలో ఏమైనా పరివర్తనం ఒస్తుందేమో అని అనుకున్నాడు. తమ్ముడు అని స్వతంత్రం లేకుండా అల్లుడు అన్న భయంతోనే సంగతులు విపులంగా వ్రాసేడు. కక్కాయి ఉగ్గూపాలూ వంటబట్టడంమూలాన రామూ ససేమిరా అన్నాడు.

ఓసారి తనే వెళ్లి మాట్లాడివస్తే ఏమైనా దారికొస్తారేమో అని వెళ్లేడు. “దస్తావేజు వ్రాసి పట్టుకురాకుండా ఏమొఖం పెట్టుకుని. గడప త్రొక్కడానికి వచ్చేవు? వెళ్లు వెళ్లు” అని నిక్కచ్చిగా చెప్పేసింది. ఆఖరికి కూర్చోమనేనా అనలేదు. పోనీ, తమ్ముడు ఏమైనా . పంథామారుతాడేమో, చదువుకున్నవాడు అని కదిపిచూచేడు. కాని కొరగాని కొయ్యే అయ్యేడు. దాంతో నడుం విరిగిన పామే అయ్యేడు శీతారామయ్య. “పోనీ, కక్కాయి మాట నిలబెట్టకూడదూ?” రామూ అన్న ఈ మాటలు శీతన్నను నిలువునా తినేసేయి. ఏమిటీ కర్తవ్యం? ఏమిటీ చెయ్యడం? ఇంటికి వెళ్ళి వెంకటలక్ష్మమ్మతో ఏమని, ఏనోరెట్టుకుని ఈవార్త చెప్పడం? సుఖపడుతుంది కదా అని నరసమ్మను తమ్ముడికిచ్చి పెళ్ళిచేస్తే

అది ఇల్లా విషమించిందే? రేపు నరసమ్మకు-తనింట్లో తిరిగే నరసమ్మకు మొఖం ఎల్లా చూపడం? తోడల్లుడితో ఎట్లా మాట్లాడుతాడు? వయస్సులో వుండి, భర్తను కలిగీ సుఖం లేక, రాత్రిళ్లు నిద్రరాక అటూ ఇటూ బాధతో బాధపడే నరసమ్మ తనపంచన ఉంటే తను ఎల్లా తిండితింటాడు? ఎల్లా మసులుతాడు? తన చేత్తో తనే నరసమ్మకు ఉరి తగిలించేడే? మరి తనింకా ఎందుకు బతుకుతున్నాడు? తలకు ఎక్కేట్టు తమ్ముడూ, కక్కాయీ కాటు వేసే వేసేరు. ఇంకా ఎన్నాళ్లు ఈ నిరంతరహృదయవిదారక దృశ్యాల్లో జీవనం చెయ్యడం? ఇంటికెళ్లి ఏమైందని అడిగితే ఏనోరుతోటి ఈవార్త చెప్పడం? దారిలో చచ్చిపోతే నయం అనిపించింది. రైలుపట్టాలదగ్గరకికూడా వెళ్లేడు. కాని తను చచ్చి ఎవర్ని ఉద్ధరిస్తాడు?

నడపీనుగ అయి ఇంటికి వచ్చేడు. తలెత్తుకు కాదు. జీవంతో ఉండే కళ్లతో కాదు. వంచుకుని, కన్నీరు కార్చి కార్చి ఉబ్బిపోయిన కనుపాట్టలతో. హృదయం వ్రక్కలై పోతుందా? కడుపు మాడిపోతుందా? భూదేవి ఈదుఃఖం భరించలేక విచ్చిపోతుందా? ప్రళయం ఈపళంగా వచ్చి చుట్టు ముట్టేస్తుందా? అన్న భారంతో వచ్చేడు. కాళ్లు కడుక్కోనీయకుండానే వెంకటలక్ష్మమ్మ అడిగింది. పెదిమవిరిచి గుడ్ల నీరు కుక్కుకున్నాడు. ఆఖరుకు తండ్రిపోయిన రాత్రికూడా అంత దుఃఖించలేదు.

నరసమ్మను కావలించుకుని వెంకటలక్ష్మమ్మ భోరున ఏడ్చింది. "చేతులారా నీకాపురంలో నిప్పులు పోశేమే! మాయదారి సంబంధం కుదిర్చేమే! పాలు అని పోస్తే విషం అయిందే...ఇంకోచోట పడితే నాలుక్కాలాల పాటు సుఖంగా వుందువేమో!"

నరసమ్మ పెళ్లికాకమునుపు తన భర్తను అర్థం చేసుకుందుకు ప్రయత్నించింది. స్వతహాగా భర్త ఇంత దారుణంగా తయారవుతాడా అన్న సంశయం పీకింది. పెళ్లిఅయిన తర్వాత ఒక్క ఘంటసేపైనా ఎప్పుడూ మాట్లాడలేదు. తను ఓసారి భర్తదగ్గరకి వెళితే మార్చగలనన్న వెర్రిధైర్యం వుంది.

ఆ రాత్రి భార్యాభర్తలు ఇద్దరూ భోజనం చెయ్యలేకపోయేరు. ఒకర్ని చూస్తూ ఒకరు లోపల్లోపలే దుఃఖించేరు. నిశాతఘాతాలు ఇంకా ఏమి భరించవలసివస్తుందో అని క్రుంగేపోయేరు.

ఈ వార్త తోడల్లుడి చెవులో ఎల్లాపడిందో కాని, మరి రెండురోజులకు భార్యాభర్తలిద్దరూ వచ్చేరు. శీతారామయ్యా వెంకటలక్ష్మమ్మల ప్రాణాలు పైకి పోనేపోయేయి. ఆకులా అల్లాడిపోయేరు. కూతుర్ని భర్త బ్రతికుండగానే విధవను చేసేరని ఇద్దరూకూడా విరుచుకుపడినారు. నరసమ్మ తల్లితో చెప్పింది—"తొందరపడకండమ్మా! అన్నీ చక్కపడతా"యని. కాని కుర్రకుంకమాటలు ఎవరు చెవినిపెడతారు? ఒక్క కసురు కసిరిపారేసేరు. ప్రపంచకంలో పెట్టవలసిన చివాట్లు, తిట్లు అన్నీ ఆ రాత్రి ఆ భార్యాభర్తలకు ప్రసాదించేరు.

"పిల్లలులేని గొడ్రాలివి...నీకేం తెలుస్తుందే తల్లికడుపుశోకం" అంది అప్పగారు..

భార్యాభర్తలిరువురూ అల్లాగే భరించేరు.

పెద్దలెవరో కలుగజేసుకుని "పోనీ, మీరు అమ్మాయిని ఓసారి అక్కడకు తీసుకువెళ్లితే, ఏమైనా సరిపడే సన్నివేశాలు వస్తాయేమో? అబ్బాయి మరినా మారవచ్చు" అన్నారు.

తలతిక్క కాస్త తిప్పుకుని ముగ్గురూ బయల్దేరేరు కాకినాడకు. కాస్త ఎక్కడైనా దూరంగా వెల్తురు కన్పిస్తుందేమో అని శీతారామయ్యా వెంకటలక్ష్మమ్మలు క్షణికంగా తేలికపడ్డారు.

ఇంటికి వచ్చేవరకు కక్కాయి మాట్లాడలేదు ...తీరా వచ్చినపని చెప్పేటప్పటికి "శీతన్న చచ్చేడా ఏం? మధ్యవర్తిత్వానికి నువ్వు వచ్చేవు...ఒక్కటే మాట. ఆస్తి వ్రాసిఇస్తేనే ఇచ్చేదు ఈ శ్రావణమాసంలోపుగా. లేకపోతే మా వాడికి రెండోపెళ్లి చేస్తా. అప్పుడే సంబంధాలు వేలకువేలు గుమ్మరిస్తామని వస్తున్నాయి." నిక్కచ్చిగా చెప్పేసింది కనకమ్మ.

'రెండోపెళ్లి!' భార్యాభర్తలు నిలువునా నీరైపోయేరు. ఇంకేమిటి మాట్లాడ్డం? కోపం కాస్త మ్రింగుకుని సాయింత్రం రామూతో మాట్లాడేరు. నరసమ్మకూడా అడిగింది. కాని కనకమ్మకు తందానతాన అనే స్థితిలో రామూకూడా మాట్లాడేసరికి నడుంవిరిగిన పాములే అయ్యేరు. ఆఖరున వెళ్లేటప్పుడు-

"నువ్వూ, కనకమ్మా మానవులమీద పడి రక్తం త్రాగే పిశాచాలు" అన్నాడు వియ్యంకుడు ఆగ్రహం

పట్టలేక. "అవును నిజమే! శీతన్న చేసిన దారుణాలు, మీవాడు కనుక, ఏమీ కనిపించవు. మమ్మల్ని జయిలులో పెట్టించడానికి కూడా వాడు ఎత్తు వేసేడు." అంది కనకమ్మ. దిగమింగుకునే శీతన్న ఇంటికి వచ్చి రెండింతల శక్తితో అక్షింతలు జల్లేసేరు.

నరసమ్మ తను అక్కడే వుండిపోతా నంది. "నీ కర్మ-ఇంకా వాళ్లనే పట్టుకు దేవుళ్లాడుతా నంటా వేమిటే" అని తల్లీ, తండ్రీ కోప్పడ్డారు. నరసమ్మ మంకుతనం పట్టి అక్కడే వుండిపోయింది.

శీతారామయ్యకు రోజులు గడుస్తున్నాయన్న పేరేకాని, ఎదురుగా నరసమ్మను చూస్తుంటే గుండెలు తరుక్కుపోతున్నాయి. నిల్చున్నపళంగా ఆ అమ్మాయి రక్తం తను తాగేస్తున్నానే అని రోజూ ఏడ్చేవాడు.

రెండునెలలు గడిచేయి. వెంకటలక్ష్మమ్మ దిగులూ, ఏడ్పులతో కృశించిపోయింది. శీతన్న అసలు అన్నమే తినలేకపోయేవాడు. వాళ్లిద్దరూ తనమూలంగా ఇల్లాంటిస్థితికి రావలసివచ్చింది కదా అని నరసమ్మ చాలాసార్లు మథనపడింది. ఏదైనా మార్గం ఉందా అని ఎంత ఆలోచించినా ఎటూ తట్టలేదు. ఇక మిగిలిపోయిన జీవనంలో వాళ్ల సేవ చేస్తే తనకు వాళ్లు చెయ్యగల్గిన సుఖం దుఃఖంక్రింద పరిణమించినా, తన తీర్చలేని కృతజ్ఞత ఉండిపోతుందనే తలంపుతోనే రోజులు గడిపింది.

ఆ మార్చినెలలో రైతులు శీతారామయ్యకు శిస్తులు తీసుకొచ్చేరు. వచ్చినదాంట్లో మూడొందలు పెట్టి నరసమ్మకు గొలుసు చేయించేడు. తక్కినడబ్బు తను పెళ్లికి భార్యమెడలోనుంచి తీసి బ్యాంకులో తాకట్టుపెట్టిన కాసులపేరుకు జమకట్టేడు. ఇంకా ఐదువందలు ఉండిపోయింది.

పోనీలే, నరసమ్మను ఓ కొడుకుక్రింద చూచుకొందామని ఎంత గుండెనిరుకుచేసుకుని మెసలుదామన్నా, సీతారామయ్యా, వెంకటలక్ష్మమ్మలకు ధైర్యం చాలలేకపోతోంది. ఎదురుగా తిరిగే నరసమ్మ, ఆ వయస్సులో మొగుడితో కులుకుతూ ఉండాల్సిందే...తమ దురదృష్టంవల్ల ఇల్లా జరిగిందే... ఎంత కొడుకుక్రింద చూచుకున్నా నరసమ్మ హృదయంలో పడే బాధ తీర్చగలరా? ఇది మనోవ్యథే అయింది ఇద్దరికీ.

రోజూ ఆఫీసుకు వెళ్తూనేవున్నాడు. ఏదో పని చేస్తున్నాడన్న పేరేకాని, మనస్సు ఆలోచనల్తో పరిపరివిధాల పోతూవుంది. ఉత్సాహం ఎప్పుడో చచ్చిపోయింది. అందరూ అడిగేరు "ఏం శీతారామయ్యా, అల్లా వున్నా"వని. దాంతో సరిపెట్టక "ఎంత కష్టం ఒచ్చిందోయి...వాళ్లు ఎక్కడో కర్కోటక ముండావాళ్లలా ఉన్నారు" అని పరామర్శ! ఎద్దు పుండు కాక్కేమి నొప్పి! ఒరసిన కురుపుమీద ఉప్పూ కారం చల్లినట్టు వుండేది. సమాధానం చెప్పలేక నిట్టూర్పువిడిచి ఊరుకునేవాడు. కాని లోపల్లోపల సంక్షోభం భరించలేక హృదయం వ్రక్కలైపోతుందేమో అని ఆశించేవాడు. అల్లాగైనా శాంతి దొరుకుతుందేమో అని ఆశ.

పోనీ, తనవాళ్లు వెడితే అల్లా అంటున్నారేమో అని కాలేజీలెక్చరర్లచేత రెండు మూడు విధాలుగా చెప్పించేడు రామూకు. కాని "కక్కాయిమాటకు నేనేమీ వ్యతిరిక్తంగా నడవను" అనేశాడు రామూ. కాని అక్కడక్కడా "శీతారామయ్య ఇంకా కాళ్ల బేరానికి రాడూ?...సరేలే..." అని ఏదో ప్రతీకారం చెయ్యదలచినవాడిలా మీసాలు వడేసేడుట. ఈ సంగతి విన్నప్పటినుండీ శీతారామయ్యకు మతే పోయింది.

ఇంతలోనే కాకినాడనుంచి ఓ స్నేహితుడు వచ్చి "ఏమిరా అబ్బీ, మీ తమ్ముడూ, ఆ కనకమ్మా కలిసి పెళ్లిసంబంధాలు చూస్తున్నారే! అయితే ఇంతకూ మీ ఇద్దరికీ బెడిసికొట్టినట్టేనా?" అన్నాడు.

పిడుగుపడ్డట్టే అయింది. ఇంక తనకేం పిల్లలు కల్గుతారూ? పోనీ, ఆస్తి వ్రాసిస్తే ఏం? దీన్నిగురించి చాలా మథనపడ్డాడు. కాని ఇంతవరకూ వచ్చిన విషయం...ఇప్పుడు తను వ్రాసేస్తే, తనకు నిలవడానికి నీడలేకుండా చేసి, చిప్పా కర్రా చేతికిచ్చి, విషపు నవ్వు నవ్వుదామనేకాదూ? తీరా వ్రాసిచ్చినా— అందులోనూ నరసమ్మపేర వ్రాసి ఇవ్వకూడదట— నరసమ్మ సుఖపడుతుందనీ, వాళ్లు సుఖపెడతారనీ తనకు ఏం నమ్మకం?

ఆ రాత్రి వెంకటలక్ష్మమ్మతో ఆలోచించేడు. "మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యండి" అంది.

"నేను ఆస్తి ఎల్లాగెనా వ్రాయడానికి ఇష్టమే. అది మనిద్దరి అనంతరం సంక్రమించేట్లు వ్రాస్తానన్నా. అల్లా పనికిరాదట. ఇప్పుడు మనం వ్రాసేమా, మన పీకలకు ఉరిత్రాళ్లు వాళ్ల చేతుల్లో పెట్టినట్టే." అన్నాడు. అందులో ఉన్న లాపాయింటు వెంకటలక్ష్మమ్మకు సమంజసంగానే కన్పించింది.

నరసమ్మ ఇవన్నీ వింది. డబ్బుకూ, మానవ హృదయాలకూ ముడెట్టే ఆ మొగుడితో తనేం సుఖపడగలదు? తన జీవితం ఏమిసాఫీగా నడుస్తుంది? ...మనస్సు భర్తయెడల విరిగిపోయింది.

"పోనీ, చదువుకుంటానులే నాన్నా" అని అనలేక అనలేక అంది నరసమ్మ. ఆ రోజల్లా శీతారామయ్యగుండె చెరువే అయిపోయింది.

ఏదో బ్రతకడానికి తింటున్నాడంటే తింటున్నాడన్నట్టు రోజులు వెళ్లబుచ్చేడు. అలా కడుపు కాల్చుకోడంవల్ల దగ్గూ, కాస్త జ్వరం రావడం ప్రారంభించింది. ఇది చూచి వెంకటలక్ష్మమ్మ హడలిపోయింది. భర్తభావిస్థితి ఈ మనోవ్యథతో ఏమైపోతుందో అని ఆవిడా నీరసించిపోయింది.

ఆ రోజు మామూలుగానే ఆఫీసుకు వెళ్లేడు. కొంతసేపు పనిచేసేడు. తర్వాత పెద్ద దగ్గుతెర వచ్చి రక్తంకూడా ఉమ్మేసేడు. అంతే! స్పృహలేని శీతారామయ్యను ఇంటికి బండిమీద తీసుకొచ్చేరు. తనకు ఈ భూమిమీద పసుపూ కుంకుమా అప్పుడే చెల్లినట్టు వెంకటలక్ష్మమ్మ గోలెట్టింది.

డాక్టర్లు 'క్షయ' అన్నారు. ఇక శీతారామయ్య మనవాడు కాడనే వెంకటలక్ష్మమ్మా, నరసమ్మకూడా అనుకొన్నారు. డాక్టర్లు రాజమండ్రీ శానిటోరియంకు తీసుకెళ్లమన్నారు.

వెంకటలక్ష్మ్మ, నరసమ్మలు చాకిరీతో సగం, బెంగతో సగం, ఇక భావిలో ఉన్న భీతాంగాలతో సగం కృశించిపోయేరు.

కనీసం వారానికి ఒక్కసారైనా శీతారామయ్య రామూకు ఉత్తరాలు వ్రాయించేడు. తను అంత్యదశలో ఉన్నాననీ, ఒక్కసారి చూడ్డానికి రావలసిందనీ.

కక్కాయి అంది 'అంతా నాటకం' అని. రామూ విన్నాడు శీతన్న రాజమండ్రీ శానిటోరియంలో మందు తీసుకుంటున్నాడనీ, 'క్షయ'తో చాలా చిక్కిపోయేడనీ, ఇక బ్రతుకుతాడో బ్రతకడో అనీ. రెండు మూడు వారాలుగా వచ్చిన ఉత్తరాలు చూచేడు. అంతా తనను—ఆఖరుకు నరసమ్మను పరిత్యజించినా—కడసారి చూపుక్రింద ఒక్కసారి కనపించమని. "దేహీ అని అడుగుతున్నాను—అన్నయ్య... కాదు, నీ క్రింద ఓ బానిస..." అనికూడా వ్రాసేడు. రామూ ఆలోచనలో పడ్డాడు. కక్కాయిచేతుల్లో పడి తాను వెధవ అయి, మూర్ఖుడిలా, అక్షరం ముక్క జ్ఞానం లేనివాడిలా ప్రవర్తించిన సన్నివేశాలన్నీ ఎదురుగ్గా నుంచున్నాయి! "నువ్వు నీ కర్తవ్యం ఈ విధంగానా నెరవేర్చుకొనేది? ఇదా, ఆరేళ్లపాటు సుఖంలో, కష్టంలో నీతో పాల్గొంటూ, ఆఖరుకు నీకు జబ్బుచేస్తే అన్నంతినే దోసిలితో నీ మలమూత్రాలు ఎత్తిన అన్నకూ, వదినకూ చెయ్యవలసిన మర్యాద? ఇదా కృతజ్ఞత? నీకేమైనా లోటు చేసేడా? అక్కడ ఉన్న సంవత్సరాలు రాజాలా గడిపేవే"

మరి కక్కాయి చెప్పిందో? ఎదో! ఏమిటో? తను గుడ్లు తెరవనప్పుడు జరిగిందట! ఎల్లా నమ్మడం? ఇంకెవరూ చెప్పలేదే?

ఇక నరసమ్మ...తను మంగళసూత్రం కట్టి, ఆ జన్మాంతం నిన్ను వదలనని సప్తపథం త్రొక్కి అగ్నిసాక్షిగా ప్రామాణికం చేసేడే? మరి తను అనుసరిస్తున్న మార్గం? తనంటే ఇంకేమైనా గౌరవం ఉంటుందా? తన్ను ఓ మనిషి క్రింద నరసమ్మ లెక్క వేస్తుందా? కక్కాయిమూలంగా తను నరసమ్మను హృదయంలోనుంచి తరిమివెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. తను ఆమెభిక్షుమీద నిల్చున్నాడన్న మాట. ఆడదానిచేతుల్లో కీలుబొమ్మయి, ఇన్నాళ్లూ తాను వంటింట్లోకూర్చుని అన్నం ఉడకేసే ఆడదానికంటె కనాకష్టం అయ్యేడన్నమాట.

తనెందుకు బ్రతుకుతున్నాడో తనకే తెలియదు. ఆ సన్నివేశాల్ని గురించి తను ఇంతవరకూ ఆలోచించనందుకు విచారించేడు. తీరా ఆలోచించినా తన అసమర్థత ఎదురుగ్గా నుంచుంటోంది. ఇప్పుడు కిం కర్తవ్యం? ఎల్లాగా తను ఎదుర్కోవడం? చచ్చే అన్నగారికి ఆఖరుఘంటల్లో అయినా ఆత్మశాంతి ఇవ్వడం ఎలా? తను అన్నదగ్గరికి వెళ్లి - బ్రతికుండగానే మాంసం కోసి కాల్చుకుతిన్న ఈ శరీరంతో వెళ్లి ఆయనను ఎల్లా చూడ్డం?

ఆ వారం ఇంకొక ఉత్తరం వచ్చింది. అందులో డాక్టరుకూడా వ్రాసేడు. అన్నయ్యవ్రాతలో అప్పుడే వొంకర్లు బయల్దేరేయి. డాక్టరు ఇక పది రోజులుకూడా గడవడం కష్టమే అని సూచించేడు. అన్నయ్య ఉత్తరంలో "నాయనా! నాకు సంతానం లేకపోవడంమూలాన నిన్ను కొడుగ్గానే పెంచుకుందామని నా దగ్గరకు తెచ్చుకున్నానేగాని నువ్వూ, కక్కాయీ అనుకున్నట్టు విషపుహృదయంతోమాత్రం కాదు. తండ్రిహృదయంతో, పుత్రప్రేమ కావాలన్న అర్రులుచాచే హృదయంతో తెచ్చుకొన్నాను. నాభార్య మాతృప్రేమతోనే పెంచింది. నీకు మా ఇంటిదగ్గరున్న ఆరేళ్లల్లోనూ ఏవిధమైన లోటూ రాకుండానే కాలం గడిపించే మనుకుంటాను. ఇదంతా జరిగిపోయింది. నేను దివ్యలో కాలుఆశించే నరసమ్మను నీకిచ్చి పెళ్లి చెయ్యడం. కాని అవన్నీ నిరాశలై అధోగతిలో పడ్డాయి. ఏనాడు ఏపాపం చేసేనో తెలియదు. అది అనుభవిస్తున్నాను. నామూలాన్ని నేను కట్టుకున్న పెళ్లాం, పెంచుకున్న నగసమ్మ—వాళ్ల ఉసురుకూడా కట్టుకున్నాను. ఏది ఎల్లా వున్నా ఈ అంత్యగడియల్లో ఒక్కటే అడుగుతున్నా. నువ్వూ నేనూ ఈప్రపంచంలో నాన్నరక్తాన్ని పంచుకుని బ్రతికివున్నాం. అంతే! మన కింకెవ్వరు లేరు. నాపంచప్రాణాలూ ఏమో నీమీద పెట్టుకున్నాను. ఒక్కటే తుదికోర్కె కోరుతున్నాను. నమ్ముతావో నమ్మవో.అని డాక్టరుదగ్గరనుంచి చీటీ పంపుతున్నాను. నరసమ్మను ఏలుకున్నా ఏలుకోకపోయినా, కొడుకు అని చూచుకున్న నీవు ఈదుర్మార్గుణ్ణి ఈచచ్చేగడియల్లో క్షమించి చూడ్డానికి రా నాయనా. నీకాళ్లు పట్టుకు అడుగుతున్నాను. క్షమించి రా! తండ్రీ! ఒక్కసారి నీముఖం చూపించు. నరసమ్మ చచ్చిందనే అనుకుంటాను. ఆఖర్ని చచ్చిపోయేటప్పుడు కాస్త శాంతంతో చస్తాను. ఇదే నా తుదికోర్కె. నాయనా, రా. నన్ను కనికరించు. క్షమించు......"

ఉత్తరం సాంతంగా చదివేడు. కక్కాయి అంది: "ఆవ్యాధి నీకూడా అంటించి వంశానికి రూపనామాలు లేకుండా చేద్దామనిరా"

'ఏమో!' నమ్మలేకపోయేడు. అంత దీనంగా వ్రాసిన అన్నయ్య ఇంకా విషలిప్తమా? తేనెపూసిన కత్తా?

ఆరాత్రి చాలాసేపు ఆలోచించేడు. ఆరాత్రే బయల్దేరి రాజమండ్రీ వెళ్లేడు. కక్కాయికి తెలియనివ్వకుండానే. శానిటోరియందగ్గరకి వెళ్లేటప్పటికి కాళ్లు వణికేయి. శరీరం చెమటలుపట్టేయి. ఎల్లా ఈ మొఖం చూపించడం అన్నయ్యకు?

తల వంచుకునే లోపలికి వెళ్లేడు. నర్సును అడిగేడు. ఎంతో ఆదరంగా చెప్పింది. ఆఖరుకు అల్లాంటివాళ్ల కాళ్లుముట్టుకోవడానికికూడా తను పనికిరాడేమో అనిపించింది. 'పన్నెండో నెంబరు గది'. జీవితంలో రెండుముళ్లు పన్నెండు కొట్టినట్టే అయింది. దూరంనుంచే అన్నయ్య "నాయన వచ్చేడా?" అన్న హీనస్వరం చెవినిపడింది. ఆక్షణంలో ప్రాణం ఎందుకుపోకూడదా అనిపించింది రాముకు. "నాయన వచ్చేడా?" "నాయన వచ్చేడా?" ఆప్రశ్నే ప్రతీ వస్తువూ తనను నిలవదీసి అడుగుతున్నాయి. వెంకటలక్ష్మమ్మ 'రాలేదు' అంది. "ఒస్తారు" 'గు'స్పష్టంగా వినిపించింది. శబ్దం ఆనమాలుకట్టేడు. అంతే.

లోపలికి నిర్జీవంగానే వెళ్లేడు. ఆ ఆరుకళ్లూ ఆశ్చర్యంతో అల్లాగే ఉండిపోయేయి. నెమ్మదిగా శీతారామయ్యకళ్లమ్మట రెండుచుక్కలు రాలేయి. "తండ్రీ, వచ్చేవా? ఆఖరుదశలో అన్నయ్యను చూడ్డానికి దయకలిగిందా?" ఆ వేదనతో అతిక్షీణంగా వచ్చేయి. రామూ నిలవనేలేకపోయేడు. తన సంచీ అక్కడే పారేసి 'అన్నయ్యా!'అని బావురుమన్నాడు. వెళ్లి కౌగలించుకున్నాడు. శీతారామయ్య అతనితల నిమురుతూనే, కన్నీళ్లుకారుస్తూనే "నాయనా, ఒక్కసారి బాబాయి అని పిలు! అదే కోరుతున్నా" అన్నాడు.

"బాబాయి"—కళ్లు మెరిసేయి. జీవితంలో కన్నతండ్రికంటె ఎక్కువగా పెంచిన తండ్రికే, అన్నయ్యకే తను ఎదురుతిరిగి పిశాచపునవ్వు నవ్వేడు. ఇల్లాంటి శీతలహృదయానికి కార్చిచ్చు పెట్టేడు.

చంటిపిల్లాడిలా రామూ ఏడ్చేడు.

"ఊరుకో నాయనా" వెంకటలక్ష్మి అంది. 'అమ్మా'అని పిల్వడానికి నరకకూపంలో కొన్నిలక్షల వత్సరాలు క్రిమికీటకం అయి, చీమూ రక్తం పీల్చి, తన పాపపరిహారం చేసుకున్నా తగనేమో ఆపిల్పుకు అనిపించింది.

చూచేడు. ఇదివరకటి వెంకటలక్ష్మమ్మ కాదు. అప్పుడు డొక్కా శీతమ్మగారిలో ఆదరించిన మాతృ

దేవత కాదు. నిరంతరశోకయుక్తమై, దావాగ్నులలో నల్గి, ఎముకల ప్రోగైఉన్న, మూర్తీభవించిన శోక దేవత.

"అమ్మా, క్షమించు" ఏ హృదయంతో అన్నాడో తెలియటం లేదు.

"ఇప్పటికైనా కనికారం కల్గింది మామీద" ఎంత అమాయకత్వం!

ప్రక్కగా ఉన్న నరసమ్మను చూచేడు. తను చూస్తుంటే పమిటి సవరించుకుని, పాలిపోయిన బుగ్గల్లో మంగళసూత్రం కట్టినందుకు గౌరవం చూపించింది. అంతే!

చూడ్డానికి-కనీసం నమస్కరించడానికయినా తనకు హక్కు లేదు.

శీతారామయ్య ఆఖరున అడిగేడు: "నాయనా, అన్నయ్యని. ఇక నూకలు ఎల్లాగానూ లేవు. చెయ్యెత్తుతున్నా. ఇవి చేతులుకావు. కాళ్లు అనుకో. నరసమ్మను నీచేతిలో పెట్టేను. కనికరించు. ఆమెని చూస్తుంటే హృదయం తరుక్కుపోతోంది. సాటివారికి దూరమైపోయేను." ఇంక చెప్పనివ్వకుండానే దగ్గుతెర వచ్చింది.

రామూకు అంతా తెలిసివచ్చింది. "అల్లాగే అన్నయ్యా! జీవితాంతరం ఇప్పుడు. నీమీదగా ప్రమాణం తీసుకుంటున్నా." అంతే.

ఒక్కసారి ముగ్గురిహృదయాలూ తేలికపడ్డాయి.

తర్వాత జరిగిన రోజుల్లో రామూ నిద్రాహారాలు లేకుండానే అన్నయ్యకు సపర్యచేసేడు. కాని ఫలం దక్కకనేపోయింది.

బ్రతికున్నప్పుడు చెయ్యలేక, ఆఖరు రోజుల్లో కృతజ్ఞత కనబర్చిన హృదయం గగ్గోలుపెట్టింది.

లోకం అంతా చీకటి. అంధకారం. ప్రళయం. జీవితంలో కన్నతండ్రిప్రేమ చూడేలేదు. తండ్రిలా, ఏడుగడలా చూచిన అన్నయ్యను, ఒదినను, ఆఖరుకు పెళ్లాన్ని తను నిల్చుండగానే జీవచ్ఛవాలు చేసేడు. అదీ ప్రతిఫలం.

తన చేతుల్తోనే చితి అంటించేడు. తన్ను పెంచిన తండ్రిని తనే కాల్చేసేడు. మసిచేసేడు. తన చేష్టలవల్ల, తన హృదయదౌర్బల్యంవల్ల, తన నైతికపతనంవల్ల తనేలోకంలో ఓ ప్రేమహృదయాన్ని పోగొట్టుకున్నాడు. ఎక్కడనుంచి పిలిస్తే వస్తాడు, అన్నయ్య-కాదు బాబాయి?

నడప్పీనుగే అయి ఇంటికి వచ్చేడు.

కర్మకాండ సరిగ్గానే భక్తితోనే చేసేడు.

"అమ్మా! నా దగ్గరనే వుండువుగాని రా. జీవితంలో ప్రక్కమార్గంలో ఓసారి పడ్డా. కనికరించు" అన్నాడు.

"నాయనా! బ్రతికున్నన్నాళ్లూ ఆయనతోనే వుంది జీవనం. ఆయన లేరు. ఇంక ఏ ముఖం పెట్టుకుని లోకానికి మొఖం చూపిస్తాను" అంది వెంకటలక్ష్మమ్మ.

బరువుగానే నరసమ్మని కాకినాడ తీసుకెళ్లేడు. బండి ఎక్కేటప్పుడు వెంకటలక్ష్మమ్మ కాగితాలు చేతిలో పెట్టింది.

తన అనంతరం ఆస్తి తన అభిమానపుత్రుడు రామూకు చెందునట్లు, వెంకటలక్ష్మమ్మకు నెలకు పతి రూపాయలు మనోవర్తి ఇచ్చుటకున్నూ వీలు.

రామూ ఏడ్చేడు. చచ్చికూడా, దిక్కూ మొక్కూ లేకుండా చచ్చినా, శీతారామయ్య తన యెడల ప్రేమ, వాత్సల్యం చూపించకుండా ఉండలేకపోయేడు. మరి తనో?

కక్కాయి ఆశ్చర్యపడింది. అంతే. తర్వాతి రోజుల్లో కక్కాయిని పులిస్త్రికంటె కనీసంగా చూచేడు.

సంవత్సరీకాలు అయ్యేయి. అప్పుడే ఒక్కసారి వెంకటలక్ష్మమ్మ తిరిగి కన్పించింది.

దేవుడి మేలువల్ల నరసమ్మ కొడుకుని కంది. అల్లుడి పేరు పెడతాడేమో అని కక్కాయి ఆసించింది.

'శీతారామయ్య' అని వ్రాసేడు. నరసమ్మకు ఆశ్చర్యం కల్గింది. కక్కాయి కూలేపోయింది. వెంకటలక్ష్మమ్మ విని సంతోషించింది.

అంతే. బ్రతికి ఉపకారం చెయ్యలేనివాడు చచ్చినతర్వాత కృతజ్ఞత చూపించుకున్నట్లే అయింది. శీతారామయ్యపేరు ఇప్పటికీ దేవుడిలా తలుస్తూనే వున్నాడు రామూ!

'తమ్ముడు'! జీవితంలో తను తమ్ముడుగా చేసిన దుర్మార్గాలకు ఇంకా వాపోతూనేవుంటాడు.